క్లుప్తంగా

ఫిజియోథెరపీతో సత్ఫలితాలు



బాన్సువాడ రూరల్: శారీరక వికలాంగులైన విద్యార్థులకు ప్రతిరోజు ఫిజియోథెరపి చేయడం వల్ల సత్ఫలితాలు వస్తాయని బాన్సువాడ భవిత కేంద్రం ఫిజియోథెరపిస్టు గంగాధర్ అన్నారు. గురువారం భవిత కేంద్రంలో వివిధ గ్రామాలకు చెందిన విద్యార్థులకు ఫిజియోథెరపి చేశారు. వికలాంగలైన విద్యార్థులకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహ విద్యార్థులు చేదోడు వాదోడుగా ఉండాలన్నారు. వారి వైకల్యాన్ని అవహేళన చేయకుండా వారిని ఆదరించాలన్నారు. ప్రతి గురువారం భవిత కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపి శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఐఈఆర్పీ పద్మ, వసంత్ ఉన్నారు.

ఎల్లారెడ్డిలో ..



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి భవిత కార్యాలయంలో గురువారం ఫిజియోథెరపి క్యాంపు నిర్వహించారు. ఫిజియోథెరపి క్యాంపులో అంగవైకల్యం గల చిన్నారులకు ఫిజియోథెరపిస్ట్ అరుణ్ వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులకు ప్రతిరోజు ఫిజియోథెరపీకి సంబంధించిన వ్యాయామాలను చేయించడం వల్ల అంగవైకల్యం దూరమవుతుందన్నారు. సిబ్బంది వెంకటేశం, శివకుమార్ తదితరులున్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక



ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): మత్తమాల జెడ్పీ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థినులు జిల్లా హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పీఈటీ సతీష్‌రెడ్డి గురువారం తెలిపారు. అండర్-14 విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు వైష్ణవి, నందినీలు మంచిర్యాల జిల్లాలో ఈనెల 8 నుంచి నిర్వహించనున్న హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

రోడ్డు పనుల పరిశీలన



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): బెజుగంచెరువుతండాలో చేపట్టిన బీటీ రోడ్డు పనులను గురువారం స్థానిక జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జప్తిజాన్కంపల్లి ఊరచెరువు అలుగు నుంచి బెజుగంచెరుతండా వరకు సుమారు 2 కిలోమీటర్ల 800 మీటర్ల మేర బీటీ రోడ్డు పనులను అధికారులు ఇటీవల ప్రారంభించారన్నారు. దీని కోసం ప్రభుత్వం నుంచి రూ.2కోట్ల24లక్షల నిధులు మంజూరైనట్లు చెప్పారు. తాండూర్ సొసైటీ డైరెక్టర్ కిషన్‌నాయక్, బొల్లారం ఉపసర్పంచ్ ధర్మవీర్, బీఆర్ఎస్ నాయకులు హరిలాల్, రాము, సాయిలు తదితరులున్నారు.

కార్తీక మాస ప్రత్యేక పూజలు



బాన్సువాడ : బాన్సువాడ అయ్యప్ప ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గురువారం దుర్కి సోమలింగేశ్వర ఆలయంలో అయ్యప్ప స్వాములు కార్తీక మాస ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక మాసం చివరి వారం కావడంతో అయ్యప్ప మాలధారణ స్వాముల దంపతులతో ప్రత్యేక పూజలు చేయించారు. వన భోజనాలు నిర్వహించారు. అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడు ముదిరెడ్డి విఠల్‌రెడ్డి, శ్రీనివాస్, సాయిరెడ్డి తదితరులున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



నిజాంసాగర్(జుక్కల్): బోరుబావుల తవ్వకం, తాగునీటి పైపులైన్లతో పాటు మురికి కాలువల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని మండల పరిషత్ అధ్యక్షులు పట్లోళ్ల జ్యోతి అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులతో ఎంపీపీ సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో తాగునీటి ఎద్దడి, పైపులైన్లు, మురికి కాలువ నిర్మాణ పనులకు సంబంధించి తీర్మానాలు చేశారు. సమావేశంలో ఎంపీటీసీలు జనార్దన్, సంగారెడ్డి, ఎంపీడీవో నాగేశ్వర్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల ఏఈలు సురేశ్, సుమలత తదితరులున్నారు.

ప్రమాదకరంగా గుంతలు

- పట్టించుకోని అధికారులు
- పూడ్చి వేయాలని కోరుతున్న స్థానికులు



మత్తమాల శివారులో రోడ్డుపై గుంత..



మూల మలుపు వద్ద..

ఎల్లారెడ్డిరూరల్(ఎల్లారెడ్డి): రోడ్లపై ప్రమాదకరమైన గుంతలతో ప్రయాణానికి ఇబ్బందులు కలుగుతున్నాయని, మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని మత్తమాల గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎల్లారెడ్డి మండలంలోని మత్తమాల గ్రామ శివారులో రుద్రారం వెళ్లే దారిలో ప్రమాదకరమైన పెద్ద గుంతలు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ శివారులో ఏర్పడిన పెద్ద గుంతల కారణంగా రెండు వాహనాలు ఒకేసారి వచ్చిన సమయంలో గుంతలో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు. గతంలో ఆర్టీసీ బస్సు చక్రం గుంతలో పడడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామ శివారులో సైతం ప్రమాదకమైన మూల మలుపులు ఉండడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని గ్రామస్తులు తెలిపారు. అధికారులు స్పందించి రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలను పూడ్చడంతో పాటు మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలను అధికారులు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చి వేయాలి



గ్రామ శివారులో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు పడ్డాయి. దీంతో రోడ్డుపై ప్రమాదాలు జరుగుతున్నాయి. రోడ్డుపై ఏర్పడిన పెద్ద గుంతలను పూడ్చి వేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. – దుర్గయ్య, మత్తమాల

సూచికలు ఏర్పాటు చేయాలి



గ్రామ శివారులో ప్రమాదకరమైన మూల మలుపులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అధికారులు మూల మలుపుల వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయాలి. – శివయ్య, మత్తమాల

హౌస్ హోల్డ్ సర్వేను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీవో శ్రీనివాస్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గ్రామాలలో పంచాయతీ కార్యదర్శులు హౌస్ హోల్డ్ సర్వేను పూర్తి చేయాలని నాగిరెడ్డిపేట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో) శ్రీనివాస్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో పలు గ్రామాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఇంటింటికి తిరిగి హౌస్ హోల్డ్ సర్వేను వెంటనే పూర్తి చేయాలన్నారు. దీంతోపాటు గ్రామాలలో వంద శాతం ఇంటిపన్నులు వసూలు చేయాలని ఆయన చెప్పారు. సీజనల్ వ్యాధులబారిన పడకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు.

రోడ్డుపై గుంత ఎన్నటికి తీరేను చింత



మొగులాన్‌పల్లితండాలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంత

బాన్సువాడ రూరల్: మొగులాన్‌పల్లి తండా బస్టాండ్ వద్ద బాన్సువాడ-ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై ప్రమాదకరంగా గుంత ఏర్పడింది. ఈ రోడ్డు గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. గుంతలో వాహనాలు పడి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. రెండునెలలైనా అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవడం లేదని తండావాసులు వాపోతున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డుపై ప్రమాదకరంగా ఏర్పడిన గుంతలను పూడ్చి వాహనదారులకు ఇబ్బంది కలుగకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రజావ్యతిరేక నిర్ణయాలతోనే బీఆర్ఎస్ ఓటమి

కామారెడ్డి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ శాసనసభ ఎన్నికల్లో ఓడిపోవడానికి ప్రధాన కారణం ప్రజావ్యతిరేక నిర్ణయాలే అని కామారెడ్డి మాజీ కౌన్సిలర్ డి.సత్యవతి ఓ ప్రకటనలో వ్యాఖ్యానించారు. ప్రజలు మార్పు కోసం కాంగ్రెస్‌ను గెలిపించారని, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినందున ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీల్లో చాలీచాలని వేతనాలతో పనిచేస్తున్న ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని ఆమె కోరారు.

దివ్యాంగులకు భరోసా కల్పించాలి



కామారెడ్డి టౌన్: కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలోని దివ్యాంగులకు భరోసా కల్పించాలని విజ్ఞాన్ వికలాంగుల సేవా సమితి వ్యవస్థాపకుడు చిప్పదుర్గాప్రసాద్ కోరారు. సీఎంగా రేవంత్ రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం దివ్యాంగురాలు రజినీకి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. దివ్యాంగులను సీఎం రేవంత్‌రెడ్డి అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈశ్వర్, నర్సింలు తదితరులున్నారు.

ఎమ్మెల్యేను కలిసిన బల్దియా అధికారులు



కామారెడ్డి టౌన్: కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డిని మున్సిపల్ కమిషనర్ దేవేందర్‌తో పాటు అధికారులు, సిబ్బంది గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేకు మొక్క, జ్ఞాపిక, పుష్ప గుచ్ఛం అందజేశారు. శాలువాతో సత్కరించారు. పట్టణ అభివృద్ధికి, ఆదర్శ బల్దియాగా పేరు తీసుకురావడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. టీపీవో గిరిధర్, ఎంఈ వాసుదేవ రెడ్డి, ఆర్‌వో రవిగోపాల్‌రెడ్డి, ఏఈ రవి, సానిటరీ ఎస్సైలు రవీందర్, పర్వేజ్, మేనేజర్ భవాని, గంగా కిషన్, నవీన్ తదితరులున్నారు.

బాలికలపై హింసను అరికట్టాలి



అవగాహన కల్పిస్తున్న రాజేందర్

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మహిళలు, బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాలని ఐఎస్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు అమృత రాజేందర్ అన్నారు. క్రిష్టాజీవాడిలోని ఉన్నత పాఠశాలలో గురువారం ఇన్‌స్పైర్ సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతియేటా నవంబరు 25న స్త్రీ, హింస నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహించనున్నామని, డిసెంబర్ 10న మానవహక్కుల దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. అలాగే మహిళల అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. కళాశాల, పాఠశాలలో వేధింపులకు గురైతే 100కు ఫోన్ చేయాలని సూచించారు.

సాయిబాబా ఆలయానికి 65 గ్రాముల వెండి అందజేత



పిట్లం(జుక్కల్): మండలంలోని తిమ్మనగర్ గ్రామానికి చెందిన శ్రీకర్ రెడ్డి 50 గ్రాముల వెండి, నింగయ్య 15 గ్రాముల వెండి మొత్తం 65 గ్రాముల వెండిని గురువారం మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయానికి విరాళంగా ఆలయ కమిటీ సభ్యుడు బెజుగం శేఖర్‌కు అందజేశారు. అంతకుముందు వారు కుటుంబ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యుడు బెజుగం శేఖర్ మాట్లాడుతూ.. దాతల సాయంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు



పెద్దకొడప్‌గల్(జుక్కల్): మండల కేంద్రంలో మంచినీటి పైప్ లైన్ లీకేజీ అవుతోందని స్థానికులు సర్పంచ్ తిర్మల్ రెడ్డికి సమాచారమివ్వడంతో వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ సిబ్బందితో పైప్‌లైన్‌కు మరమ్మతులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తిర్మల్ రెడ్డి మాట్లాడుతూ.. వాతావరణం చల్లగా ఉందని, ప్రతి ఒక్కరు నీటిని కాచి చల్లార్చి తాగాలని సూచించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది మారుతి, వెంకటేష్ తదితరులున్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ఉత్తునూర్‌లో మొక్కజొన్న, శనగ పంటలను గురువారం ఏఈవో శిరీష పరిశీలించారు. మొక్కజొన్నకు కత్తెర పురుగు ఉధృతి ఎక్కువ ఉన్నందున తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. శనగ పంటలకు ఆశించిన వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు అశోక్ రావు తదితరులు పాల్గొన్నారు.

'సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లండి'



సదాశివనగర్(ఎల్లారెడ్డి): ముథోల్ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే రామారావు పాటిల్‌ను గురువారం ఆర్యక్షత్రియ సంఘం ప్రతినిధులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆర్యక్షత్రియులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు. ఆర్యక్షత్రియ సంఘం ప్రతినిధులు పాతంగల్ కిషన్ రావు, భూంరావు, రమేశ్‌రావు, లింగారావు, సంతోష్ పాల్గొన్నారు.

చనిపోయినవారి పేర్లు తొలగించాలి



మాట్లాడుతున్న తహసీల్దార్ మహేందర్ కుమార్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల కోసం తయారు చేసిన ఓటర్‌జాబితాలో నుంచి చనిపోయిన వారి పేర్లను తొలగించాలని నాగిరెడ్డిపేట తహసీల్దార్ మహేందర్‌కుమార్ సూచించారు. నాగిరెడ్డిపేట మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బీఎల్‌వోలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్ జాబితాలో పేర్లు, చిరునామా సవరణకు సైతం అవకాశం ఉందన్నారు. ఓటరు జాబితాలో నూతనంగా పేర్లను నమోదు చేసుకునేందుకు సైతం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రాందాస్, ఆర్ఐ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ సాయిలు పాల్గొన్నారు.

'బీఆర్ఎస్ వద్ద డబ్బులు తీసుకోలేదు'

కామారెడ్డి అర్బన్: బీఆర్ఎస్ పార్టీ వద్ద తాను ఎలాంటి డబ్బులు తీసుకోలేదని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు సిరిగాద లక్ష్మీనర్సయ్య స్పష్టం చేశారు. గురువారం పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సయ్యతో పాటు సంఘం వర్కింగ్ అధ్యక్షుడు ఐరేని నర్సయ్య, ప్రచార కార్యదర్శి బోగ వెంకటనారాయణ, కోశాధికారి సబ్బని ధర్మపురిలు ఒక సంయుక్త ప్రకటన చేశారు. బీఆర్ఎస్ పార్టీ వద్ద డబ్బులు తీసుకున్నట్టు బొమ్మెర భూమేష్, ఇంజమూరి శ్రీనివాస్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని అన్నారు.

సేంద్రియ కర్షనమే సేద్యానికి మేలు



మాట్లాడుతున్న ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్

సదాశివనగర్(ఎల్లారెడ్డి): సేంద్రియ కర్షనమే సేద్యానికి మేలని సేవా స్ఫూర్తి ఫౌండేషన్ ప్రాజెక్టు మేనేజర్ రత్నాకర్ అన్నారు. గురువారం అడ్లూర్ ఎల్లారెడ్డి సింగిల్ విండో కార్యాలయంలో సేంద్రియ సాగుపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కొన్ని సంవత్సరాలుగా భూసారం కాలక్రమేణా తగ్గిందన్నారు. ప్రస్తుతం భూమి పంటలు పండించే శక్తిని పూర్తిగా కోల్పోయే స్థితికి చేరిందన్నారు. పశువుల ఎరువులు, ఇతర సేంద్రియ ఎరువులు వాడకపోవడం, కేవలం రసాయనిక ఎరువులకే పరిమితం కావడం అనే స్థితికి చేరిందని పేర్కొన్నారు. వాతావరణ వ్యత్యాసాల వల్ల పంట దిగుబడులు ఆశించినంతగా ఉండటం లేదన్నారు. రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలన్నారు. విండో చైర్మన్ మర్రి సదాశివ రెడ్డి, రీజినల్ సేల్స్ మేనేజర్ కృష్ణారావు, కంపెని ప్రతినిధి చంద్రమోహన్, మాజీ సర్పంచ్ సుదర్శన్, మహేందర్‌రెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న సాధన సంస్థ కో-ఆర్డినేటర్ కొప్పుల రవి

దోమకొండ: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో గురువారం బాల్య వివాహాలపై సాధన సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సాధన సంస్థ కో-ఆర్డినేటర్ కొప్పుల రవి మాట్లాడారు. కైలాస్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ సాయంతో యాక్సిస్ టు జస్టిస్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామన్నారు. బాల్య వివాహలు లేని భారతదేశం నిర్మించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. బాల్య వివాహలు జరుగుతున్నట్లు తెలిస్తే సమాచారం అందించాలన్నారు. చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, 18001027222 సంప్రదించాలని కోరారు.

రేవంత్ ప్రమాణస్వీకారం.. కాంగ్రెస్ సంబురాలు



దోమకొండలో సంబురాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు



లింగంపేట అంబేద్కర్ చౌరస్తాలో..

తెలంగాణ రాష్ట్రానికి రెండో ముఖ్యమంత్రిగా ఎనుముల రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేయడంతో జిల్లా వ్యాప్తంగా గురువారం కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబరాలు చేసుకున్నాయి. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు ప్రధాన కూడళ్లలో టపాకాయలు కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. పలు వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. జై కాంగ్రెస్, జై రేవంత్ రెడ్డి అంటూ నినాదాలు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



భిక్కనూరులో ..



పిట్లంలో..



నిజాంసాగర్ మండల కేంద్రంలో..



మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో..

ఆర్థిక సహాయం అందజేత..



సాయం అందిస్తున్న ఎస్ఆర్ ఫౌండేషన్ సభ్యులు



సాయం అందజేస్తున్న డాక్టర్ పెరమాండ్లు

బీబీపేట: చిన్నమల్లారెడ్డి గ్రామానికి చెందిన పంపరి నర్సింలుకు చెందిన ఇల్లు ప్రమాదవశాత్తు కాలిపోవడంతో అందులో ఉన్న వస్తువులు సైతం బూడిదైపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సుభాష్‌రెడ్డి, గురువారం బాధిత కుటుంబానికి రూ. 25 వేలను ఆర్థిక సహాయంగా అందించారు. వైస్ ఎంపీపీ రవీందర్‌రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు మట్ట శ్రీనివాస్, అశోక్‌గౌడ్, గ్రామ సర్పంచ్ ఆనందరావు, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధిత చిన్నారికి ..

బీబీపేట: క్యాన్సర్‌తో బాధపడుతున్న చిన్నారికి ఆర్థిక సహాయం అందించి మానవత్వాన్ని చాటుకున్నారు మండల కేంద్రానికి చెందిన ఛత్రపతి శివాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ పెరమాండ్లు. వివరాలు.. మెదక్ జిల్లా కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ రాములు కుమార్తె హరిణి 5వ తరగతి చదువుతోంది. చిన్నారికి బ్లడ్ క్యాన్సర్ సోకి బాధపడుతుండటంతో పలు ఆస్పత్రులకు తీసుకెళ్లారు. క్యాన్సర్ ప్రారంభ దశలోనే ఉందని, రూ.15 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు తెలిపారు. సోషల్ మీడియా ద్వారా విషయం తెలుసుకున్న పెరమాండ్లు రూ.51 వేలు తన వంతుగా ఆర్థిక సహాయం అందించారు. చిన్నారిని పలకరించి తల్లిదండ్రులకు ధైర్యం చెప్పారు. అంతే కాకుండా చిన్నారికి ఎవరైనా ఆర్థిక సహాయం చేయాలనుకున్న వారు రాములుకు 80741 18653(ఫోన్‌పే, గూగుల్‌పే) ద్వారా డబ్బులు పంపించగలరని పెరమాండ్లు కోరారు.